
# ఇందిరా రమాదేవీయం




ఆఫీసుకు వచ్చి అరగంటైనా కాలేదు. చూస్తున్న ఫైలు మూసేసి ఆవలించింది రమాదేవి. పక్క సీట్లో తల వంచుకుని పని చేసుకుంటున్న సురేఖతో—"అర్జెంటు పనా?" అంది.

"ఊఁ!" అంది సురేఖ తల ఎత్తకుండానే.

ఇదేమీ పట్టించుకోకుండా తన ధోరణిలో సాగిపోయింది రమాదేవి. "ఏమిటో తోచక గానీ, నా కసలు

ఉద్యోగం అక్కర్లేదోయ్! ఈ చీర బాగుందా? నిన్న ఏమీ తోచక బజారు వెళ్ళాను. ఈ చీర నచ్చింది. అంతే కొనేశాను. మొన్న మా పాప కోక గౌను కుట్టి దాని మీద ఎంబ్రాయిడరీ వేశాను. ఎంత బాగా వచ్చిందనుకున్నావు! ఈ మధ్య మా పాప భలే బొద్దుగా తయారయింది. ఎంత స్వీట్‌గా ఉందో! ముద్దొస్తుందని మా పక్కింటి డాక్టరు గారి భార్య దాన్నెప్పుడూ వాళ్ళింట్లోనే ఉంచుకుంటుంది. మేమిద్దరం మ్యాట్నీల్లో వెళుతూంటే అచ్చం రాజేష్ ఖన్నా, హేమామాలినీలా ఉంటామని మా ఎదురింటి మీనాక్షిగారంటారు."

ఇలా నయాగరా జలపాతంలా సాగుతూనే ఉన్నాయి మాటలు. పాపం! సురేఖ కిది రోజూ మామూలే. సరిగ్గా పని చేసుకునే టైములో రమాదేవి తన మాటలతో బోరు కొట్టిస్తూ పని సాగనివ్వకపోవటం, మాట్లాడకుండా తన పని చేసుకోవాలని సురేఖ తాపత్రయ పడటం, గంటలో చెయ్యవలసిన పని రెండు గంటలలో చెయ్యటం... ఇది రోజూ జరిగే తతంగమే. సురేఖది సాధు స్వభావం. ఎవ్వరినీ నొప్పించలేదు. రమాదేవి మాటలు వినుగు పుట్టించినా, తన పనికి ఆటంకం కలిగించినా పల్లెత్తు మాట అనేది కాదు. చేతనయినంత ఏకాగ్రతతో తన పని చేసుకుంటూనే ఉండేది. మారు మాట్లాడకుండా వినే సురేఖ దొరకటంతో రమాదేవి అనర్గళంగా, నిరాటంకంగా రోజూ తన గొప్పలు చర్వితచర్వణంగా చెప్పేది. అయితే, ఇందిర రాకతో రమాదేవికి పెద్ద బెడద వచ్చి పడింది.

ఇందిర ఆఫీసులో కొత్తగా చేరింది. వచ్చిన కొత్తలో రమాదేవి మాటలకు ఆశ్చర్యపోయేది. నవ్వుకునేది. స్వతహాగా ఇందిర చాలా నిక్కచ్చి మనిషి. స్నేహానికి ప్రాణం పెడుతుంది. ఏదేనా అనదలుచుకుంటే కుండబద్దలు కొట్టినట్టు నిర్మొహమాటంగా అనేస్తుంది. రమాదేవి చెప్పే గొప్పలూ, ప్రగల్భాలూ సురేఖలా ఓపిగ్గా వినలేకపోయేది. అయితే, తను వచ్చిన కొత్త కాబట్టి, రమాదేవితో పెద్ద చనువు లేదు కాబట్టి మొదట్లో విననట్టు ఊరుకునేది. ఆ ఆఫీసులో వీళ్ళు ముగ్గురే ఆడవాళ్ళు. మిగిలిన వాళ్ళంతా మధ్యాహ్నం ఇంటర్వెల్‌లో

## 'లోపాముద్ర'

క్యాంటీన్‌కు వెళ్ళేవారు. వీళ్ళు ముగ్గురూ మాత్రం టిఫిన్ బాక్సుల్లో ఏదో ఒకటి తెచ్చుకుని ఇంటర్వెల్‌లో ఆఫీసులోనే కబుర్లు చెప్పుకుంటూ తినేవారు. దానితో ఇందిరకు వాళ్ళిద్దరితో పరిచయం పెరిగింది. ముగ్గురి మధ్యా కాస్త చనువు ఏర్పడింది. బహువచన ప్రయోగం ఏకవచనంలోకి మారింది. సంభాషణలో చాలా భాగం రమాదేవి మాటలే. సురేఖ చాలావరకు మాట్లాడకుండా వినేది. ఇందిర మధ్య మధ్య ఏదేనా మాట్లాడేది. ఒకరిద్దరు శ్రోతలు దొరికేసరికి రమాదేవి ధోరణి మరీ విజృంభించింది. ఒక్క లంచ్ టైములోనే కాక, ఆఫీస్ టైములో కూడా అదే పనిగా మాటలు! ఇందిరకి సహనం పూర్తిగా పోయింది. ఓ రోజు రమాదేవి ఎప్పట్లా—"నా కీ ఉద్యోగం ఖర్మేమిటి చెప్పూ! హాయిగా ఇంట్లో ఉండక!" అంది.

వెంటనే ఇందిర— "మరెందుకు చేస్తున్నావూ?" అంది.

"ఊరికే! తోచక చేస్తున్నాను. 'నీ కెందుకోయ్ ఉద్యోగం? ఆ వెధవ మూడొందలూ నే నివ్వనూ!' అంటారు మా వారు. నే నసలు డబ్బు కోసం చెయ్యటం లేదు."

"డబ్బు కోసం కాకపోతే అనవసరంగా చెయ్యొచ్చుగా? జీతం తీసుకోవట మెందుకూ?"


ఈ అనుకోని పరిణామానికి తెల్లబోయి తబ్బిబ్బుపడి ఏం చెప్పాలో తెలియక ఊరుకుంది రమాదేవి. అయితే, పాపం! రమాదేవి ఎప్పటికప్పుడే మరిచిపోతుంది. ఈ మధ్య ఇందిర తరుచూ తన మాటలను విమర్శిస్తున్నా, రోజు కొక్కసారేనా తన గొప్ప చెప్పక మానదు. మరునాడు ఇలా సాగించింది.

"ఇంట్లో ఎప్పుడే పిండివంటలు చేసినా నేను తినను."

"ఎందుకూ?" అంది ఇందిర, ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేస్తూ.

"అదంతే! నాకు మిగలదు. ఏదేనా చేసిన రోజున తప్పకుండా మా ఇంటి కెవరో ఒక రొస్తారు. చేసినదంతా అయిపోతుంది."

"నీ కాస్త మిగుల్చుకోవచ్చుగా?"

"అబ్బే! అలా మిగలదు. ఇది మన ఇంటికోసం చేశాను. వచ్చిన వాళ్ళందరికీ పెట్టడానిక్కా'దని మా వారితో చెప్పు తానా? అప్పటికి సరే వంటారు. ఇంటి కెవరేనా ఫ్రెండ్స్ రాగానే, 'రమా! నిన్న చేసిన మైసూర్‌పాక్ ఇలా పట్రా' అని ఎదుటే కూర్చుని ఆ వచ్చిన వాళ్ళ ముందే గట్టిగా అంటారు. ఇంకేం చెయ్యను? వచ్చినట్టు పెట్టేస్తాను. ఎప్పుడూ ఇదే వరస!"

"అంతా విన్నవే అయిపోయిందని నువ్వొ వంటింట్లోంచి గట్టిగా అరవ రాదూ?" నవ్వే నవ్వుఆపుకుంటూ అంది ఇందిర.

"ఏమో, బాబూ, నే నలా అబద్ధం చెప్పలేను." సత్యహరిశ్చంద్రుడిలా మొహం పెట్టింది రమాదేవి.

"అబద్ధం చెప్పలేవుగాని, పెట్టి తిట్టుకుంటావన్న మాట! సురేఖా! జాగర్త. ఎప్పుడేనా రమాదేవి ఇంటి కెళితే ఏం పెట్టినా తినకు. నువ్వు వెళ్ళాక తనకేం మిగల్లేదని వాపోగలదు. అయినా రమాదేవీ, అందరికీ పెట్టి నువ్వు తినకపోవడం నాకేం బాగాలేదు. తనకు మాలిన ధర్మం ఎందుకూ? అలా చెయ్యటానికి రంతిదేవుడి లాంటి వాళ్ళకూ, ముంగిస చెప్పిన పేలపిండి బ్రాహ్మడి లాంటి వాళ్ళకీ చెల్లుతుంది. మనకెందుకు?"

లోపల ఒళ్ళు మండుతున్నా, కుతూహలం కొద్దీ అడిగింది రమాదేవి: "రంతిదేవుడి కథ నాకు తెలుసుగాని, పేలపిండి బ్రాహ్మణుడి కథన్నా వేమిటి?"

"అదా? మహా భారత యుద్ధం తర్వాత ధర్మరాజు రాజసూయ యాగం చేసి అంతులేని బంగారాన్నీ, రత్న రాసులను దానం చేశాడట. అప్పుడొక ముంగిస అక్కడి కొచ్చి ఈ దానధర్మాలన్నీ ఒక బ్రాహ్మణుడి పేలపిండి దానంతో సమానం కావన్నదట. ఈ మాటలు అక్కడి ఋషులూ, రాజులూ—అందరూ ఆశ్చర్యపోయి అదేమిటంటే ముంగిస ఇలా చెప్పిందట: ఒక బ్రాహ్మణుడు తన భార్య, కొడుకు, కోడలుతో ఉండే వాడట. వాళ్ళు రోజు కొక్క సారే ఆహారం తీసుకునే వారట. పక్షుల్లా ధాన్యం ఏరుకునేవారట. ఒకసారి కరువు వచ్చి ఆ కుటుంబానికి రోజు కొకసారైనా ఆహారం దొరికేది కాదట. ఒక రోజు నిట్ట మధ్యాహ్నం ఎర్రటి ఎండలో వాళ్ళు కొంత యవధాన్యం సంపాదించి దాన్ని పిండికొట్టి నాలుగు ముద్దలు చేసి తినబోతుంటే ఒక అతిథి వచ్చాడట. అతణ్ణి మర్యాదచేసి కూర్చోబెట్టి, బ్రాహ్మణుడు తన వంతు పేలపిండి ముద్ద ఇచ్చాడట. అతిథికి ఆకలి తీరకపోతే అతని భార్య తన వంతు ఆహారం ఇచ్చిం [illegible] బ్రాహ్మణుడి కొడుకూ, కోడలూ తమ వంతు ఆహారం కూడా ఇచ్చారట. ఆ అతిథి యమధర్మరాజుగా మారి, వాళ్ళందరినీ స్వర్గానికి పంపించేశాడట. అప్పుడా ముంగిస అక్కడ ఉండటంవల్లా, ఆ నీళ్ళు కాసిని దానిమీద పడటం వల్లా, ఆ పేలపిండి వాసన వల్లా దాని తల, సగం శరీరం బంగారమైనాయట. పాపం! మిగతా శరీరం కూడా బంగారం చేసుకుందామనుకుని ధర్మరాజు చేసే రాజసూయం దగ్గరకు వచ్చి ఆశాభంగం పొందింది. ఇదీ కథ. అట్లాంటి వాళ్ళకు తనకు మాలిన ధర్మంగాని, అంతటి ఔదార్యం లేని నీకూ, నాకూ ఎందుకూ?"

"ఏమో? నీలా కథలూ కాకర కాయలూ నాకు రావు" అంది రమాదేవి, మొహం మాడ్చుకుంటూ.

ఇంకోరోజు సురేఖ పచ్చచీర కట్టుకొచ్చింది. "నీకు పచ్చరంగు సూటవ లేదు, సురేఖా! ఇంకెప్పుడూ కట్టుకోకు" అంటూ ఉచితంగా సలహా ఇచ్చింది రమాదేవి.

"ఏమిటో, రమాదేవీ! నే నన్ని రంగులూ వాడతాను. చీరా, దాని ఖరీదూ నచ్చితే కొంటాను. ఇది నాకు సూటవుతుందా, లేదా అని పెద్దగా ఆలోచించను." నిర్లక్ష్యంగా జవాబిచ్చింది సురేఖ. సురేఖను చూసి ఎంతో జాలిగా 'అయ్యో పాపం!' అన్నట్టు నవ్వింది రమాదేవి. అంతటితో ఆగక—"నేనుమాత్రం అలా కాదు, బాబూ! అన్నీ నాకు సూటయ్యే చీరలే కొంటాను" అంది.

[illegible] అంతా ఇందిర చెవుల బడుతూనే ఉంది. ఇంతవరకూ కుతూహలంగా వింటున్న ఇందిర ఇక ఊరుకోలేకపోయింది. "ముదురు నీలం, ఎరుపూ, ఆకుపచ్చా నీకు సూటవుతాయనే కట్టుకుంటున్నావా, చిట్టీ?" అంది నవ్వుతూ.


రమాదేవికి ఉక్రోషం వచ్చేసింది. నిజానికి తను నలుపు. అయినా, ముదురు రంగులన్నీ కడుతుంది. ఉన్న మాటే గనక ఏమీ అనలేక ఊరుకుంది.

ఎప్పుడూ కుక్కర్లో వండే కూరలు తన కిష్టంలేదని చెప్పే రమాదేవి ఓ రోజు హఠాత్తుగా—"మేం కుక్కర్ కొన్నామోయ్" అని అనౌన్స్ చేసింది. "ఆశ్చర్యం! ఆశ్చర్యం! ఇకమీదట నీకు కుక్కర్లో చేసిన కూరలు సరిపడతాయన్న మాట." చురక అంటించింది ఇందిర. "నేనేం ఇష్టపడి కొనలేదు. పని త్వరగా తెములుతుందని కొన్నాను" అంది రమాదేవి రుసరుసలాడుతూ. అంతటితో పోనిస్తే బాగుండదన్నట్టు వెంటనే ఇలా మొదలెట్టింది: "మా వారు బెంగుళూరు నుంచి బోలెడన్ని కాయగూరలు తెచ్చారు. వారం రోజులు వండినా తరగలేదు. ఇంకా మిగిలిపోయి పాడయిపోతే పారబోశాను."

పగలబడి నవ్వింది ఇందిర. "అయ్యో! ఎంతపని చేశావు, రమాదేవీ! ఈ కరువు రోజుల్లో కూరగాయలు కుళ్ళబెట్టి పారెయ్యట మెందుకూ? ఈ సంగతి ముందుగా చెప్పినట్లయితే నేనూ, సురేఖా చెరో గంప తీసుకుని వారం రోజుల కిందటే మీ ఇంటికి పరుగెత్తుకు వచ్చే వాళ్ళంగా! పోనీలే! ఏం చేసాం! పాపం [illegible] లేదు. ఈ సారి మమ్మల్ని గుర్తుంచుకో! అలా పారబొయ్యకేం!" నవ్వకుండా ఉండలేకపోయింది సురేఖ. ఇంకేదో అనబోయిన ఇందిర, కోపంతో కందిపోయిన రమాదేవి మొహం చూసి వ్యవహారం శ్రుతిమించి రాగాన పడేట్టుందని ఊరుకుంది.

అధునాతనంగా, నవనాగరికంగా అలంకరించుకోవటం రమాదేవికి అలవాటు. అలా అలంకరించుకుని ఊరుకుంటే బాగుండేది. వచ్చిన బాధంతా, ఆ అలంకరణను సమర్థించుకోజూడటం లోనే. ఎర్రగా కెదురు పెట్టినట్టు లిప్‌స్టిక్ వేసుకుంటుంది. "పెదాలు పగులతాయని లిప్‌స్టిక్ వేసుకుంటానోయ్!" అంటుంది, ఎవరూ అడక్కపోయినా. జాకెట్టు చేతులు మోచేతులు దాటుతాయి. హై నెక్ జాకెట్లు. "అబ్బ! ఈ పొట్టి చేతుల జాకెట్లలా వేసుకుంటారో అసహ్యంగా! ఒళ్ళంతా కనబడదూ!" అంటూ గొప్పగా తన మోడస్టీని ప్రదర్శించింది. ఇంకా— "కొందరు నైలెక్సు కట్టుకుంటారు. అంత పలచటి చీరలు కట్టుకుంటే ఏం బాగుంటుంది? అస లంత పలచటి బట్టలు కట్టుకునే బదులు మానేస్తే ఏం?" అంది.

"రమాదేవీ! నైలాన్, నైలెక్సుల గురించి నాకు పెద్దగా తెలియదుగాని, బట్టలు ఒళ్ళు కనబడకుండా ఉండేందు



కని ఒప్పుకుంటున్నావు గదా? అలాగే బట్టలు కట్టుకున్నందువల్ల మనకు ఫ్రీగా ఉండటానికే! హాయిగా. ఫ్రీగా ఉండాలిగా! పొడుగ్గా, మోచేతులు దాటిన జాకెట్లు లావుపాటి వాళ్ళు వేసుకుంటే వాళ్ళ ప్రాణం ఎట్లా ఉంటుందో ఆలోచించు! ఫ్రీగా ఉండాలని, సగం శరీరం కనిపించేట్లు వేసుకోవాలని నే ననటం లేదు. దేనికైనా మోడరేషన్ ఉండాలి.'' అంతటితో సంభాషణ ఆపేసింది ఇందిర.

తరవాత ఆరునెల్లు కల్లా ఓ తమాషా జరిగింది. వారం రోజులు సెలవు పెట్టి ఎవరో బంధువుల పెళ్ళికి మద్రాసు వెళ్ళింది రమాదేవి. తిరిగి వచ్చేటప్పటికి గొప్ప మార్పు! రమాదేవి ఆఫీసులో కాలు పెట్టగానే ఇందిరా, సురేఖా, ఇంకా మిగిలిన ఆఫీసు సిబ్బందంతా గుడ్లప్పగించి చూడసాగారు. అయిదు నిమిషా లయిన తరవాత అందరూ తేరు కుని, సభ్యత గుర్తొచ్చి తలలు వంచు కుని ఎవరి పనులు వాళ్ళు చేసుకో సాగారు. ఇంతకీ రమాదేవి ఎలా ఉంది? పలచగా, ఉల్లిపొరలా ఉన్న గులాబి రంగు షిఫాన్ చీరె కట్టుకుంది. అదే రంగు జాకెట్టు వేసుకుంది. ఆ జాకెట్టు స్లీవ్‌లెస్ జాకెట్‌లా ఉంది కాని, కాదు. పరీక్షగా చూస్తే చేతులున్నట్టే ఉంది. వీపు సగం పైగా కనిపించేటంత లో నెక్ జాకెట్ అది. ఆ చీరె కూడా బొడ్డు కిందకు కట్టుకుంది. 'పాపం! మోడెస్టీ మాట మరిచిపోయినట్టుందే రమాదేవి!' అనుకుంది ఇందిర మనసులో. మధ్యాహ్నం లంచ్ బ్రేక్‌లో అందరూ కాంటీన్ కెళ్ళాక వీళ్ళు ముగ్గురే మిగిలారు. ఇందిర ఏదైనా అంటుందేమోనని చాలా సేపు ఎదురుచూసింది రమాదేవి. ఎంతకీ ఇందిర తన గురించి ఏమీ అనకపోయేసరికి—''అమ్మయ్య! ఈ రోజు నన్ను చూసి ఏమంటావోనని భయ పడ్డాను. ఇందిరా! నా కసలు ఈ చీరె కొనుక్కోవా లనిపించలేదు. మా వారు 'ఈ రంగు నీకు బాగుంటుం' దని కొన్నారు. మద్రాసులో అందరూ పొట్టి చేతుల జాకెట్లే! వాళ్ళ మధ్య నేను వేలెత్తి చూపించినట్టున్నాను. అందుకని జాకెట్లన్నీ ఇలా కుట్టించుకున్నాను'' అని సంజాయిషీ ఇచ్చింది రమాదేవి.

''నీ ఇష్టం వచ్చినట్లు నువ్వు కుట్టించుకున్నావు. మధ్య నే నేమంటానో నని భయపడట మేమిటి? అంతగా వా ళ్ళేమంటారో, వీ ళ్ళేమంటారో అని బాధ పడేదానివి అంత త్వరగా మారటం దేనికి? పోనీ, మారావు. దానికి సంజాయిషీ లెందుకూ? ఇది పిరికితనం కాదూ?'' అంది ఇందిర.



''అయితే, మనిషన్న తరవాత మార్పంటూ ఉండదా? జడపదార్థంలా ఎప్పుడూ ఒకేలాగే ఉండాలా?'' ఎలాగో మొదటిసారి అర్థవంతంగా మాట్లాడింది రమాదేవి.

''నిజమే! నీ వన్నట్టు మనిషిలో మార్పు లేకుండా ఎలా ఉంటుంది? మార వలసిందే. ఎప్పుడో విక్టోరియా మహా రాణి కాలంలో కాలి మడమలు కనిపించ కుండా గౌన్లు వేసుకునే వారట. ఇప్పు డలా ఉంటున్నారా? ఉండాలని అన గలమా? కాలాన్ని బట్టి నడుచుకోవాలి. నలుగురితోబాటు మనమూ 'రష్ ఆఫ్ ది సివిలిజేషన్'లో పడిపోవలసిన వాళ్ళమే. అయితే, ఒక్క మాట. గుడ్డిగా, వేలం వెర్రిగా వచ్చిన ప్రతి ఫాషనూ అనుక రిస్తే ఆ మార్పు కోరదగిందేనా? పోనీ, అలా మారినా అదో బలహీనత అనుకుం టారు. ఎవరి ఇష్టం వారి దనుకుంటారు. ఇది చాలక ఆ బలహీనతను కప్పి పెట్టేం దుకు అది మోడెస్టీ అని సమర్థించుకో జూస్తే అది ఆత్మవంచనా, పరవంచనా అవుతుంది. నిన్నే తీసుకుందాం. కుక్కర్ కొనకన్నాళ్ళూ నీకు కుక్కర్లో చేసిన కూరలు సరిపడేవి కావు. కుక్కర్ కొన్న మర్నాటి నుంచీ బెండకాయ కూరతో సహా అన్నీ కుక్కర్లోనే వండు తున్నావు. నీకు చదువుంది. ఆలోచించే శక్తి ఉంది. ఉద్యోగం చేస్తున్నావు. డబ్బుకోసం ఉద్యోగం చెయ్యడం లేదం టావు. జీతం తీసుకుంటూ జీతంకోసం ఉద్యోగం చేయటం లేదనటం వెర్రికాక మరేమిటి? ఏ బాధ్యతలూ లేకపోయినా, నీ జీతం మీద ఎవ్వరూ ఆధారపడక పోయినా, నిన్ను నువ్వు పోషించుకుం టున్నావంటే అది గర్వకారణం కాదూ? ఈ ఆఫీసులో ఆఫీసరు మొదలు ప్యూను వరకూ జీతం తీసుకోని వాళ్ళ నెవరి నైనా చూపించు! ఇప్పుడు నా కో సంగతి జ్ఞాపకం వస్తోంది. మా ఫ్రెండు ఒకమ్మాయి హైస్కూల్లో టీచరుగా చేస్తోంది. జ్వర మొచ్చి రెండు రోజులు సెలవు పెట్టి మర్నాడు స్కూలు కెడితే— 'అమ్మాయ్! ఇలా మాటిమాటికీ సెలవు పెడితే కుదరదు. నీవు జీతం తీసుకుం టున్నావు. కష్టపడి పనిచెయ్యాలి' అందట హెడ్‌మిస్ట్రెస్.

'అవునండీ. మనమందరం జీతం తీసు కుంటున్నాం. కష్టపడి పనిచేస్తున్నాం. సెలవులూ పెడుతున్నాం. మనలో ఎవరేనా సెలవులు పెట్టకుండా ఉన్నారా అండీ?' అందట ఆ పిల్ల వీలయినంత అమాయకంగా మొహం పెట్టి. ఆ హెడ్ మిస్ట్రెస్ తేలకళ్ళు వేసి మరెప్పుడూ అలా అతితెలివి ప్రదర్శించలేదట.''

''నివు చెప్పేదానికీ, మనిషి మార టానికీ సంబంధం ఏమిటి?'' చిరాగ్గా అంది రమాదేవి.

''ఉంది. మనిషి అనుభవాలనుంచి నేర్చుకుని మారాలి. నీ మాటలు, కోపిస్తే మారాలి నువ్వు చేసే ప్రతి పనీ గొప్పదని, ఎదుటి వాళ్ళ చేసే అన్నీ పరికితాలని చెప్పటం మానాలి నేను సంఘ సంస్కర్తనుగాను. నిన్ను మార్చ గల గొప్పదాన్ని కాదు. రోజూ నీ మాటలు విని విని విసుగెత్తి నందువల్లా, నీ అంతట నీవే అడగబట్టి చెబుతున్నాను. నువ్వే కాదు, నేనూ మారాలి. సురేఖ బుద్ధిమంతురాలు. తనకు నీ మాటలు నచ్చినా నచ్చకపోయినా, నీవేం చెప్పినా వింటూ ఉంటుంది. నాకు వింటున్న కొద్దీ ముళ్ళు గుచ్చుకుంటున్నట్టుగా ఉంటుంది. ఇదీ ఒక రకమైన బలహీనతే. పెద్దతనమే. కాదనను. ప్రఖ్యాత అమెరికన్ రచయిత హాథార్న్ అంటాడు — ఒక మనిషి దొంగతనం చేసినా, వ్యభిచారం చేసినా, మరే తప్పుడు పనులు చేసినా తన పని తను చూసుకుని ఇంకొకరి జోలికి పోనంతవరకు అతని తప్పులూ, నేరాలూ అంత గొప్పవి కావని. అయితే, ఎంత సజ్జనుడైనా, సన్మార్గ వర్తను డైనా ఇతరుల విషయాల్లో మితిమీరిన ఆసక్తి చూపించి వాళ్ళ నాడిపోసుకునే వాడు 'క్షమించరాని మహాపాపం' ( అన్ పార్డనబుల్ సిన్ ) చేస్తున్నాడట. అలా ఉంది నా ధోరణి కూడా! కాబట్టి నీవూ మారాలి, నేనూ మారాలి! నీవు ఎదుటి వాళ్ళను తెలివి తక్కువ దద్ద మ్మల కింద జమకట్టి అర్థం పర్థంలేని గొప్పలు చెప్పటం మానేస్తావా? నేను నీ ప్రతి మాటనూ ఖండించటం మానేసి, 'అమ్మాయ్! నాకు పనుంది. నన్ను డిస్టర్బ్ చెయ్యకు' అని ఊరుకోగలనా? నీ ప్రతి మాటనూ గుర్తుంచుకుని దెప్ప కుండా ఉండగలనా? అలా మారగలిగిన రోజున మన మార్పు ఎంతగానో సంతోషించదగింది! ఎంతో అర్థవంత మైంది!'' ఆగింది ఇందిర.

ఆ తరవాత రమాదేవి ఇందిర కెప్పుడూ తనను విమర్శించే శ్రమ ఇవ్వలేదు. ఎటొచ్చీ ఇందిర మారిందీ, లేనిదీ మరో రమాదేవి వస్తేగాని తెలియదు! ఇప్పుడు ఇందిరకు తాను మారిందో, లేదో తెలుసు కునేందుకే అవకాశం ఇవ్వటం లేదు రమాదేవి. ఎప్పుడూ మౌనంగా భూదేవిలా అన్నీ ఓర్చే సహన మాత్రం 'అన్ పార్డనబుల్ సిన్' మాట మరిచిపోయి, 'ఇందిరలా నిష్కర్షగా మాట్లాడేవా ళ్ళొక్కళ్ళైనా ఉండబట్టే కదా రమాదేవి నోరు మూతబడింది. తన ప్రాణం హాయిగా ఉంది!' అనుకుంది మనసులో. ★